# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## ఇంధనం ఖర్చు తగ్గించడానికి...నేడు అడ్వాన్స్ టెక్నాలజి రాకెట్ ప్రయోగం

**- ఇస్రో చైర్మన్ సోమనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు - షార్‌లో మళ్లీ ప్రయోగాల సందడి**



శ్రీహరికోట (తడ), జూలై 21 ప్రభాతవార్త : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఎప్పటికప్పుడు రాకెట్ ప్రయోగాల్లో ఖర్చులు తగ్గించడానికి పరిశోధనలు చేస్తూనే ఉంది. ఇందులో భాగంగా ఇంధనం బరువు తగ్గించి తద్వారా రాకెట్ల తయారీ ఖర్చును తగ్గించడం కోసం అడ్వాన్స్‌డ్ టెక్నాలజి లాంచ్ వెహికల్ అనే ప్రయోగాత్మక రాకెట్‌ను సోమవారం ప్రయోగిస్తున్నారు. శ్రీహరికోటలోని స్పెక్స్ నుంచి ఉదయం 9 గంటలకు ఈ రాకెట్ నింగికి ఎగరనుంది. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ శనివారం నుంచే షార్‌లో పర్యటిస్తూ రాకెట్ ప్రయోగ సన్నాహాల్లో పాల్గొన్నారు. దేశంలోని వివిధ ఇస్రో కేంద్రాల సీనియర్ శాస్త్రవేత్తలు, షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్ తదితరులు ఆయన వెంట ఉన్నారు. సోమవారం ఉదయం జరగనున్న రాకెట్ తరహా ప్రయోగాలు ఇంతకుముందు కూడా నిర్వహించి ఉన్నారు. అయితే ఈ ప్రయోగం ఒక ప్రత్యేకమైనదిగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. సాధారణంగా రాకెట్లో పంపిస్తున్న హైడ్రోజన్ వాడకం ఉన్నప్పటికీ గాలి నుంచి ఆక్సిజన్ సేకరించి రాకెట్ ప్రయోగంలో ఉపయోగపడేలా ఈ సరికొత్త ప్రయోగాన్ని నిర్వహిస్తున్నారు. ఇందువల్ల ఆక్సిజన్ సిలిండర్ల వంటివి ఏర్పాటు చేసే అవసరం లేని కారణంగా రాకెట్ బరువు తగ్గడంతో పాటు ఖర్చు కూడా తగ్గుతుందని భావిస్తున్నారు. ఇటువంటి ప్రయోగం విజయవంతమైతే ఇస్రోకు ఇది ఒక మైలురాయిగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ రాకెట్ గురించిన పూర్తి వివరాలను ఇస్రో ఇప్పటికీ అధికారికంగా ప్రకటించలేదు. తమ అధికారిక వైబ్‌సైట్లో కూడా దీని గురించి సమాచారం, ఫొటోలు, బ్రోచర్లు వంటివి పెట్టకపోవడం విశేషం.

## ఇస్రో ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే

**- నేటి నుంచి పలు కార్యక్రమాలు**



జాబిల్లిపై దిగిన చంద్రయాన్-3లోని ల్యాండర్

శ్రీహరికోట (తడ), జూలై 21 ప్రభాతవార్త : చంద్రయాన్-3 గఘన విజయం తర్వాత దేశంలో విజయోత్సవాల అనంతరం ఈ ఏడాది నేషనల్ సైన్స్ డేని ఘనంగా నిర్వహిస్తున్నారు. గత ఏడాది ఆగస్టు 23న చంద్రయాన్‌లోని ల్యాండర్, రోవర్ జాబిల్లిని ముద్దాడిన రోజును ప్రధాని నరేంద్రమోడీ జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించారు. ఈ మేరకు అంతకు నెలరోజుల ముందే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఇస్రో ఆధ్వర్యంలో కొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎంపిక చేసిన విశ్వవిద్యాలయాల్లో కూడా శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా జరుపుతున్న కార్యక్రమాలతో పాటు ఇకముందు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని కూడా ఇస్రో ఘనంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం నుంచి కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు ఇస్రో ప్రకటించింది.

## అడిగేవారు లేరని...
# అటవీ భూములను నొక్కేశారు!

**- సర్వేనంబరు మార్పుతో రెవెన్యూ మాయాజాలం**
**- మొలకలపూడి రెవెన్యూలో అంతామాయే**

చిట్టమూరు, జూలై 21 ప్రభాతవార్త : సామాన్య, పేద, మధ్యతరగతికి చెందిన వారు ఎకరం, అర ఎకరం ఆక్రమించుకొని జీవనం సాగిస్తుంటే ఆగమేఘాల మీద వాలిపోయే అధికార యంత్రాంగం కళ్లెదుటే నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన రహదారి వెంబడి ప్రభుత్వ అటవీభూములను చదును చేసి సాగుకు సమాయత్తం అవుతుంటే కన్నెత్తి చూడలేని దౌర్భాగ్యం చిట్టమూరు మండలంలోనే జరుగుతుందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. స్థానికులు, మండల ప్రజలు అందించిన వివరాల మేరకు, మొలకలపూడి రెవెన్యూ పరిధిలోని మల్లాం – నాయుడుపేట ఆర్అండ్‌బి రహదారిని ఆనుకొని ఉన్న అటవీ భూములను సైతం తమకు కలిసొచ్చిందని, అడిగే వారు లేకపోవడంతో అక్రమార్కులు కలిపేసుకున్నారన్న విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. ప్రధాన రహదారికి ఆనుకొని లక్షలాది రూపాయలు విలువ చేసే భూములను అప్పనంగా ఆక్రమించుకుంటున్నా రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. గతంలో అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఆ శాఖ అధికారులు ట్రెంచ్ ఏర్పాటు చేశారు. నిబంధనల మేరకు అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ట్రెంచ్‌కు నాలుగు మీటర్ల వరకు ఎటువంటి నిర్మాణాలు, ఆక్రమణలు చేయకూడదన్న నిబంధనలు తుంగలో తొక్కి యధేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోకపోవడం.. వారు అక్రమార్కుల ప్రలోభాలకు గురయ్యారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు రహదారిని ఆనుకొని ఉన్న భూములకు గిరాకీ ఏర్పడటంతో సుమారు 20 ఎకరాలు వరకు ఒకేచోట ఉన్న భూమిని అప్పటి రెవెన్యూ అధికారులు రికార్డుల్లో తారుమారు చేసి సర్వేనంబర్లను సైతం గజిబిజి చేసి ఆక్రమణదారులకు హక్కులు కల్పించినట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ భూమి గతంలో అటవీ భూములుగా ఉండేవని మొలకలపూడి గ్రామానికి చెందిన మాజీ విఆర్‌ఓలు, స్థానికులు కొందరు చెబుతున్నారు. వాస్తవాలు నిగ్గు తేల్చాలంటే అటవీ అధికారులు సర్వే చేపట్టాలని కూడా ఈ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. పేదలపై కొరడా ఝుళిపించే పాలకులు, అధికారులు లక్షల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములు కళ్ల ముందు కబ్జాకు గురవుతుంటే కళ్లుండీ చూడలేని కబోదుల్లా వ్యవహరిస్తున్న తీరు పట్ల స్థానికులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మొలకలపూడి రెవెన్యూ పరిధిలో ఇప్పటికే వందలాది ఎకరాలు అటవీ అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి భూస్వాములు సాగు చేస్తున్నప్పటికీ.. అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో వారే చెప్పాలని మండల ప్రజలు కోరుతున్నారు. మొలకలపూడి రెవెన్యూలో జరుగుతున్న భూ మాయాజాలంపై వాస్తవాలు నిగ్గు తేల్చాలంటే జిల్లాస్థాయి ఉన్నతాధికారులు పరిశీలన చేసి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. మొలకలపూడి రెవెన్యూ పరిధిలో సర్వేనంబర్ 1లో 241 ఎకరాలకు పైగా అడవి పోరంబోకు భూములున్నాయని, అయితే అధికారులు అక్రమాలకు గురైన భూమిని సైతం సర్వేనంబరు 8లో చూపించి తమ మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయాన్ని గతంలో మొలకలపూడి రెవెన్యూలో పనిచేసిన విఆర్‌ఓలను సైతం 'ప్రభాతవార్త' వివరణ కోరగా ఈ భూములు సర్వేనంబరు 1లో అటవీ పోరంబోకు భూములుగా వారు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం మొలకలపూడి రెవెన్యూలో విఆర్‌ఓగా పనిచేస్తున్న అధికారి గ్రామ సర్వేయరు ప్రకారం ఈ భూములు సర్వేనంబరు 8లో 26 ఎకరాల 85 సెంట్లు పట్టా భూమిగా ఉందని చెబుతున్నారు. ఏదిఏమైనా మొలకలపూడి రెవెన్యూలో జరుగుతున్న భూదందాపై రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు దోబూచులాడు తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.



మొలకలపూడి రెవెన్యూలో కబ్జాకు గురైన వివాదాస్పద భూమి

## హెల్మెట్... హెల్మెట్!

**-బండి నడిపితే లోకల్ అయినా ధరించాల్సిందే**
**-వాహనదారులకు పోలీసుల అవగాహన**

**ప్రభాతవార్త-తిరుపతి:**

ద్విచక్రవాహనం నడిపే ప్రతి ఒక్కరూ తలకు హెల్మెట్ ధరించాల్సిందేనని... ఆగస్టు 1వతేదీ నుండి ఈ నిబంధనలు పాటించాలని తిరుపతి పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. రోడ్డుప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతుండటంతో భద్రతకు ప్రాదాన్యతనిస్తూ సుప్రీంకోర్టు ఆదేశించిన మేరకు బండి ఎక్కిదే హెల్మెట్ పెట్టుకోవాలని సూచిస్తున్నారు. ఇది వరకు పలు దఫాలుగా బండి నడిపే వ్యక్తులు హెల్మెట్ ధరించడంపై ప్రభుత్వాలు ఆదేశాలిచ్చినా ఆ తరువాత పలుకారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. అంతేగాక ప్రధాన నగరాల్లో, పట్టణాల్లో సమీపంలోని కాలనీలకు, కిలోమీటరు, రెండుకిలోమీటర్ల దూరం వరకు హెల్మెట్ వాడకం తలనొప్పిగా మారిందని, కొంతవరకు పలు రకాల నేరాలు జరిగేందుకు అవకాశం ఉందని గుర్తించి అప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ వాడకం తప్పనిసరి కాకపోయింది. ప్రస్తుతం అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వాహనదారుల భద్రతలో భాగంగా బండి నడిపే వ్యక్తి ఖచ్చితంగా హెల్మెట్ ధరించాల్సిందేనని ఆదేశించడంతో తిరుపతి జిల్లా పోలీసులు అమలుచేయడానికి సిద్ధమవుతున్నారు. ఇందుకు పదిరోజుల ముందునుండే విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో తిరుపతి నగరంలో, పరిసరాల్లోనేగాక జిల్లాలోని అన్ని ప్రధాన పట్టణాల్లో, ప్రాంతాల్లో పోలీసులు చేపడుతున్న విజువల్‌పోలీసింగ్‌లో ఈ విషయం చెబుతున్నారు. వాహనదారులు హెల్మెట్ వినియోగించడం తప్పదని సూచిస్తున్నారు. అంతేగాక ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేసేందుకు కూడా వెనుకాడరు. గతంలో పదేళ్ళక్రిందట హెల్మెట్‌పై విస్తృతస్థాయిలో అవగాహన చేశారు. అప్పట్లో హెల్మెట్‌లు కూడా డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం ఆగస్టు 1నుండి ఈ శిరస్త్రాణం తప్పని సరి చేయడంతో తిరుపతిజిల్లా పోలీసులు చైతన్యం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రజలు ఖచ్చితంగా హెల్మెట్ వాడి ద్విచక్రవాహనాన్ని నడపాలని తిరుపతి నగరంలోని పలు ప్రధాన,ముఖ్య కూడళ్లలో ఈ బోర్డులు వెలిశాయి. తిరుపతి జిల్లా పోలీసుల పేరుతో ఏర్పాటుచేసిన ఈ బోర్డుల్లో అనేక అంశాలు పొందుపరిచారు. దీనిపై జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, డిఎస్పీలు, సిఐలు కూడా విస్తృతంగా అవగాహన కల్పించడం ప్రాధాన్యత సంతరిం చుకుంది. మరీ నగరంలో కొంత దూరం, పరిసరాల్లోని కాలనీలకు వెళ్ళాలన్నా హెల్మెట్ ధారణపై రానున్న రోజుల్లో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనేది చూడాల్సిందే. తిరుపతి నగరంలోనే దాదాపు ఐదులక్షలకుగాపై ద్విచక్ర వాహనాలు వినియోగం ఉన్నట్లు పోలీసుల అంచనా. మరీ వాహనదారులకు అవసరమైన హెల్మెట్లు అందుబాటులో ఉంచడం, నాణ్యతవి విక్రయాలు జరిగేలా చూడటం కూడా పోలీసులు ఇప్పుడు దృష్టి సారిస్తున్నారు. సామాన్య ప్రజలపై భారం పడకుండా హెల్మెట్‌ల విక్రయాలు జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. మోటారు వాహనాల చట్టప్రకారం నూతనంగా ద్విచక్ర వాహనాలు కొనుగోలుచేసే యజమానులకు ఆయా షోరూమ్‌లు తప్పకుండా హెల్మెట్ ఇవ్వాలని సూచిస్తున్నారు. కొన్నేళ్ళుగా వాహనాలు నడుపతున్న వాహనదారులు మాత్రం హెల్మెట్‌ల కొనుగోలుపై దృష్టి సారిస్తున్నారు.



హెల్మెట్ వినియోగంపై పోలీసు అధికారుల తనిఖీలు

## సాంకేతిక అభివృద్ధితోనే... దేశాభివృద్ధి

**-ఘనంగా తిరుపతి ఐఐటి స్నాతకోత్సవం -విద్యార్థులకు డిగ్రీ పట్టాల బహూకరణ**



డిగ్రీ పట్టాలను అందుకుంటున్న విద్యార్థులు

శ్రీకాళహస్తిరూరల్, జూలై 21 ప్రభాతవార్త : తిరుపతి ఐఐటి ఆరవ స్నాతకోత్సవ సంబరాలను ఆదివారం అంగరంగ వైభవంగా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది జరుపుకున్నారు. ఏర్పేడు మండల కేంద్రానికి సమీపంలోని తిరుపతి ఐఐటి సోయగాలను పరిశీలించిన అతిథులు అబ్బుర పడ్డారు. డిగ్రీ పట్టాలు అందుకోవాడానికి విచ్చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రాంగణం కోలాహలంగా మారింది. అభివృద్ధిలో ఐఐటి అగ్రగామిగా నిలిచిందని పలువురు అభినందించారు. స్నాతకోత్సవం సంబరాలను డైరెక్టర్ ప్రొఫెసర్ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగింది. కార్యక్రమాల్లో చైర్మెన్ జెయస్‌డబ్ల్యు గ్రూప్ చైర్మెన్ సజ్జన్ జిందాల్ అధ్యక్షతన నిర్వహించిన స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా ఇన్ఫోసిస్ ఫౌండర్ చైర్మెన్ క్రిస్ గోపాలకృష్ణన్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ తిరుపతి ఐఐటి విద్యా సంస్థ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం మరువలేనిదన్నారు. విద్యార్థులు దేశాభివృద్ధి కోసం ఉపయోగాపడేలా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా అమర్‌రాజా భాగస్వామ్యంపై పలువురు అభినందించారు. సొంత భవనాల్లో జరిగిన 6వ స్నాతకొత్సవాన్ని ఓ పండగలా జరుపుకున్నారు.

**కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారం మరువలేనిది:**

తిరుపతి ఐఐటిలో విద్యనభ్యసించి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆదివారం స్నాతకోత్సవం సందర్భంగా క్రిస్ గోపాలకృష్ణన్ చేతుల మీదుగా అందించారు. 210మంది విద్యార్థులకు బి.టెక్,75 మందికి ఎంటెక్, 28మందికి ఎంఎస్‌సి 16 మందికి ఎంపిపి ఒక డిప్లొమా సర్టిఫికేట్లను అందించారు. ఉత్తమ విద్యావేత్తగా అనుష్ మంగళ్‌కు రాష్ట్రపతి అవార్డు లభించింది. 2024 బిటెక్ గ్రాడ్యుయేట్ల పని తీరులో స్నేహ(ఎంఎస్) ప్రధానం చేసారు. యూజీ,పిజి ప్రోగ్రామ్స్‌లో టాపర్లుగా వచ్చిన వారికి డైరెక్టర్ సత్యనారాయణ డిగ్రీలు బహూకరించారు. అలాగే సత్యనారాయణ తన నివేదికలో ఐఐటి అభివృద్ధిని వివరించారు. శాశ్వత క్యాంపస్ నిర్మానాన్ని పూర్తి చేయటం, అకడమిక్ సత్ఫలితాలకు సంబంధించి వివరించారు. ఈ సందర్భంగా ఇన్ఫోసిస్ ఫౌండర్ చైర్మెన్ క్రిస్ గోపాలకృష్ణన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఐదు కీలక అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. కో పైలట్‌గా టెక్నాలజీని స్వీకరించాలని, మాస్టర్ అడాప్టివ్ సమస్య పరిష్కారం, సిస్టమ్స్ అలోచించటం, తదాత్మ్యం, స్థితి స్థాపకతతో నడిపించుటకు పని చేయాలన్నారు. ఇవి మీకు దిక్సూచిల్లా పని చేస్తాయన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి హాస్టల్ గోడలకే పరిమితం కాకకుండా ప్రపంచ అవగాహన కల్గి ఉండాలని పిలుపు నిచ్చారు.

## కన్నుల పండువగా అగ్నిగుండ ప్రవేశం

**-పోటెత్తిన భక్తజనం-భక్తుల తోపులాట -గుండంలో జారిపడ్డ భక్తుడు-ఒకరికి గాయాలు**



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు



శ్రీకాళహస్తి, జూలై 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో నిర్వహించే ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిర అగ్నిగుండ ప్రవేశకార్యక్రమాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతోపాల్గొన్నారు. అయితే ముందుగా అగ్నిగుండంలో దిగాలన్న ఉత్సాహంతో తోసులాట చోటు చేసుకుంది. ఓ భక్తుడు అగ్నిగుండంలో జారిపడి గాయాలయ్యాయి. వెంటనే అతన్ని భక్తులు బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. ఆలయ ఆవరణ గోవింద నామ స్మరణతో, పసుపు పచ్చదనంతో కైలాసం పులకించింది. గెరిగె రాకముందే అమ్మవారిని అగ్నిగుండం వద్దకు తెచ్చి ప్రతిష్టించారు. పూజలు జరిపిన తరువాత గుండం చుట్టూ గుమ్మడికాయలు, పెరుగు, పెరుగన్నం, కర్పూరం వెలిగించారు. అగ్నిగుండంలో మొదట పూల బంతిని వేసిపూజారి ప్రవేశంచేశారు. అనంతరం భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండంలో ప్రవేశించారు. సుమారు ఐదువేల మంది భక్తులు ప్రవేశించారు.

**ఎటు చూసినా అలంకారాలే:**

శ్రీకాళహస్తి పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఎటు చూసినా పసుపు పచ్చబట్టలు, తలకు పూలపాగా, చేతిలో వేపమండ, చక్కగా గంధం అలంకారంతో అగ్నిగుండ ప్రవేశం చేసే భక్తులు కనిపించారు. పోతురాజు పట్టణంలో ఊరేగిన తరువాత ఉదయం నుంచి ఏడుచోట్ల స్నానమాచరించడం ఆనవాయితీ. సాయంత్రం వరకు వరకు నిప్పులను రగిలించారు. తరువాత రాహుకాలం దాటిన తరువాత ఆరు గంటలకు పట్టణంలో ప్రదక్షిణలు చేసుకొని రాగా అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. అగ్నిగుండంలో మొదట పూజారి దిగగా, తరువాత గెరిగె, పోతురాజుల విగ్రహాలను దింపారు. అగ్నిగుండానికి పూజారి పురుషోత్తం శాస్త్రోక్తంగా పూజలు జరిపి బలిఇచ్చిన తరువాత నిప్పు కణిలకలనుతెచ్చి అమ్మవారిఒడిలో పూలలో కట్టారు. తరువాత గోవింద నామస్మరణతో అగి ్నగుండ ప్రవేశం జరిపారు. అగ్నిగుండ ప్రవేశానికి ఆదివారం మహిళలు విశేషసంఖ్యలో పాల్గొన్నారు.

**ట్రాఫిక్ మళ్లింపు :**

ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగాఅర్జున తపస్సు రోజు నుంచి పట్టణంలో జనం చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం కల్గకుండా మందు జాగ్రత్త చర్యగా డివైయస్‌పి ఉమామహేశ్వరరెడ్డి, సిఐలు, ఎస్ఐలు వారి సిబ్బంది పోలీసులు ఉదయం నుంచి చెన్నై నుంచి వచ్చే బస్సులను సాయిబాబ మందిరం వద్ద నుంచి ఆస్పత్రి మీదుగా మళ్లించారు. కెవిబిపురం నుంచి వచ్చే బస్సులను కళాశాల వద్దనే నిలిపివేశారు. తిరుపతి వైపు నుంచి వెళ్లే బస్సులను అయ్యలనాడు చెరువు వైపు మళ్లించారు. పట్టణంలోని బిక్షాల గాలిగోపురం నుంచి ధర్మరాజుల గుడి వరకు సుమారుమూడు కిలోమీటర్ల వరకు పూలదుకాణాలు, వివిధ ఆట వస్తువుల దుకాణాలు, రకరకాల మజిలి దుకాణాలు సందడిగా మారాయి. అగ్నిగుండ కార్యక్రమాల్లో కార్యక్రమాల్లో బొజ్జల బృందమ్మ, కోలా ఆనంద్‌కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు, ఇఒ ఎన్‌విఎస్ఎన్‌మూర్తి, డిప్యూటీ ఇఒ ఎన్ఆర్.కృష్ణారెడ్డి, ఎసి మల్లికార్జునప్రసాద్, మునిసిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఇన్‌ఛార్జి లక్ష్మయ్య పలువురు ఆలయాధికారులుతో పాటు డిఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

## మా ఎమ్మెల్యే వచ్చాక లోపలికి వెళ్ళు!

**- జడ్పీ వైస్ ఛైర్మన్‌కు చేదు అనుభవం- సమావేశం రద్దు చేసి వెనుతిరిగి వెళ్ళిపోయిన జడ్పీ వైస్ ఛైర్మన్**
**- ఎమ్మెల్యే ఎదుట తెలుగు తమ్ముళ్ళు బాహాబాహీ**



తమ్ముళ్ళపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే

చిత్తూరు టౌన్, జులై 21 ప్రభాత వార్త: మా ఎమ్మెల్యే సమావేశానికి ఇంకా రాలేదు. ఎమ్మెల్యే వచ్చాక కార్యాలయం లోపలికి వెళ్ళు! అప్పటి వరకు బయటే వేచి వుండు! అంటూ తెలుగు తమ్ముళ్ళు జడ్పీ వైస్ ఛైర్మన్ ధనంజయరెడ్డిని అడ్డుకున్నారు. కార్యాలయంలోకి వెళ్ళడానికి కొద్దిసేపు ప్రయత్నించిన జడ్పీ వైస్ ఛైర్మన్ తెలుగు తమ్ముళ్ళు ససేమిరా అనడంతో మండల సర్వసభ్య సమావేశంను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి అక్కడి నుండి వెనుతిరిగారు. ఈ విషయం తెలియని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ సమావేశానికి హాజరు కావడానికి వస్తే ఆయన ఎదుటే తెలుగు తమ్ముళ్ళు బాహాబాహీకి దిగారు. యాదమరి మండల పాలకవర్గం ప్రతిపక్ష వైకాపా చేతిలో వుంది. ఈ మేరకు ఎంపిపి సురేష్ ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాలని తేదీని ఖరారు చేసి అందరికి సమాచారం అందజేశారు. ఈ మేరకు ఆదివారం మండల సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సివుంది. ఈ క్రమంలో సమావేశంలో పాల్గొనడానికి ఎంపిపి సురేష్, జడ్పీ వైస్ ఛైర్మన్ ధనంజయరెడ్డి, వైకాపా ఎంపిటిసీలు, సర్పంచ్‌లు వచ్చారు. అయితే కొంతమంది తెలుగు తమ్ముళ్ళు ఎమ్మెల్యే వచ్చిన అనంతరమే కార్యాలయంలోకి ఎవరినైనా అనుమతిస్తామని అప్పటి వరకు బయటే వేచి వుండాలని ఎంపిపి సురేష్, జడ్పీ వైస్ ఛైర్మన్ ధనంజయరెడ్డిని భీష్మించుకొని అడ్డుకున్నారు. దీంతో ఎంపిపి సురేష్, జడ్పీ వైస్ ఛైర్మన్ ధనంజయరెడ్డి సమావేశంను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి వెళ్ళిపోయారు. ఇదేమి తెలియని ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ సమావేశానికి హాజరు కావడానికి ఎంపిడిఓ కార్యాలయంకు చేరుకున్నారు. అక్కడ పాలకవర్గ సభ్యులు ఎవ్వరు కన్పించకపోవడం, తమ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలే ఎక్కువ మంది వుండటంతో ఏం జరిగిందని ప్రశ్నించారు. ఈ విషయంపై పార్టీలోని ఇరు వర్గాల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలోనే తోపులాడుకున్నారు. తన సమక్షంలోనే తమ పార్టీకి చెందిన కార్యకర్తలు తోపులాట లాడుకోవడంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే ఇరువర్గాలపై ఆగ్రహం వ్యక్తం చేసి అక్కడి నుండి వెనుతిరిగి వెళ్ళిపోయారు. పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో ఇప్పటికే రెండు మండలాల్లో సర్వసభ్య సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ ఎన్నికల వరకు రాజకీయం అని ఆపై ప్రజా సమస్యల పరిష్కారానికి కలసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ పరిస్థితుల్లో యాదమరి తెలుగుదేశం పార్టీలోని ఓ వర్గం నాయకులు ఎమ్మెల్యే సమక్షంలోనే ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకుల కోసం తోపులాట, వాగ్వివాదానికి దిగడంతో రానున్న రోజుల్లో యాదమరి మండల రాజకీయం రసవత్తరంగా మారనుంది. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో వుండటంతో ఆ పార్టీ నేతలు ఏకపక్షంగా వ్యవహరిస్తారా! లేక ప్రతిపక్షంను కలుపుకొని ప్రజా సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెడ్తారా! అనేది మరికొన్ని రోజుల్లో వీరు ప్రవర్తించే తీరుపై వుండనుంది.

## కుప్పంలో పారిశుద్ధ్యం..పచ్చదనంపై ప్రత్యేక దృష్టి : కమీషనర్



**కుప్పం, జూలై 21 ప్రభాతవార్త :** కుప్పం మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యం, పచ్చదనంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి కార్మికులచే పారిశుద్ధ్య పనులు చేయించారు. పట్టణంలోని కొత్తపేట మార్కెట్ ఏరియాలో చెత్త చెదారాలు తొలగింపజేయించారు. అలాగే పట్టణ ప్రధాన రహదారిలో డివైడర్లపై ఏపుగా పెరిగిన చెట్లను సిబ్బందిచే కత్తిరింపజేశారు. పట్టణం సుందరంగా కన్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. వర్షాకాలం కావడంతో ప్రజలు అంటు వ్యాధుల బారిన పడకుండా వైద్యఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ పరిధిలో ఏదేని సమస్యలు ఉంటే తన ఫోన్ నెం 9849901049నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 62మంది ఎంపిక



**కుప్పం, జూలై 21 ప్రభాతవార్త :** సాయిమాతా సేవా ట్రస్ట్, బెంగళూరు శంకర కంటి ఆస్పత్రిచే ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 150మంది హాజరు కాగా వారికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి 62మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి సోమవారం బెంగళూరులో ఆపరేషన్లు నిర్వహిస్తారు. కార్యక్రమంలో వైద్య బృందం శివ, లావణ్య, నేత్ర, వీరభద్రప్ప, ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు పాల్గొన్నారు.

## తెలంగాణా సిఎం రేవంత్‌రెడ్డిని కలసిన ఎమ్మెల్సీ



**కుప్పం, జూలై 21 ప్రభాతవార్త :** తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ నగరంలోని నోవాటెల్ హోటల్‌లో జరిగిన కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణా సిఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈసమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ సిఎం రేవంత్‌రెడ్డిని కలసి పుష్పగుచ్ఛం అందించి కలిశారు.

## ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



**కుప్పంరూరల్/శాంతిపురం/రామకుప్పం/వి.కోట, జూలై 21 ప్రభాతవార్త :** గురుపౌర్ణమి వేడుకలను కుప్పం, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో ఘనంగా నిర్వహించారు. కుప్పం పట్టణంలోని హెచ్‌పి రోడ్, మోడల్ కాలనీ, ఎంఎఫ్‌సి జూనియర్ కాలేజ్ వద్దగల శ్రీసాయిబాబా ఆలయాల్లో ఈ సందర్భంగా విశేష పూజలు, హారతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే శాంతిపురం మండలంలోని పరమహంస యోగానంద గురుకులంలో పౌర్ణమి సందర్భంగా పిల్లలకు అక్షరాభ్యాసన, పాదపూజ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్, నారాయణశెట్టి, చంద్రశేఖర్, గణపతిశాస్త్రి, కోదండప్ప, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. రామకుప్పంలోని శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో పౌర్ణమి సందర్భంగా బాబా విగ్రహానికి పాలాభిషేకం, హారతులు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవాన్ని ఊరేగించారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమంను ఆర్యవైశ్య సంఘంచే చేపట్టారు. వి.కోటలో పౌర్ణమి సందర్భంగా శ్రీ సత్యసాయి భజన మండలిని జిల్లా సత్యసాయి సేవా సమితి అధ్యక్షులు మధుసూధనం ప్రారంభించారు. డా॥ యశోద, వసంత, వేదం, సావిత్రి పాల్గొన్నారు.

## నారా భువనేశ్వరి పర్యటన జయప్రదం చేయాలి



**రామకుప్పం, జూలై 21 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి కుప్పం పర్యటన జయప్రదం చేయాలని మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు మునస్వామి, పత్ర నారాయణ కోరారు. ఈనెల 25న నారా భువనమ్మ మండలంలోని ఆవులకుప్పం, నారాయణపురం తాండా, వీర్నమల, ఆరిమానుపెంట గ్రామాల్లో పర్యటించి మహిళలతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో నేతలు నరసింహులు, మనోహర్, జయశంకర్, గజేంద్ర, విశ్వనాథ్, మురళి, రఘు పాల్గొన్నారు.

## జోరుగా జనసేన పార్టీ సభ్యత్వాలు

**గుడుపల్లె, జూలై 21 ప్రభాతవార్త :** జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలంలో జోరుగా సాగుతోంది. నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ నరేష్ అధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు అమీర్ నేతృత్వంలో ఆదివారం నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదును చేపట్టారు. కార్యక్రమంలో నేతలు పాండు, విన్నీ, చంద్రశేఖర్, శ్రీను, మణికంఠ, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

## శ్రీసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు

**తవణంపల్లె, జూలై 21 ప్రభాతవార్త:** మండలంలోని ఎ.గొల్లపల్లె గ్రామంలో వెలసిన శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ఆదివారం గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో గ్రామస్థులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఎ.గొల్లపల్లెలో వెలసిన శ్రీసాయిబాబా ఆలయంలో ఆదివారం జరిగిన గురుపౌర్ణమి వేడుకల్లో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు స్థానిక సర్పంచ్ ఎన్.ప్రవీణ్, ఆలయ నిర్వహకుల ఆధ్వర్యంలో గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట మండల టీడీపీ అధ్యక్షుడు దిలీప్, నాయకులు మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో వ్యాసమహర్షికి ప్రత్యేకపూజలు

**కాణిపాకం, జూలై 21 ప్రభాతవార్త:** గురుపౌర్ణమి(వ్యాసపౌర్ణమి) సందర్భంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి ఆలయంలో వ్యాసమహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయంలో అలంకార మండపంలో వ్యాసమహర్షి చిత్రపటాన్ని వుంచి వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చకులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన స్పెక్టర్ విఘ్నేష్, అర్చకులు, వేదపండితులు పాల్గొనా న్నరు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

**కాణిపాకం, జూలై 21 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు ఆదివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన బాలాజి అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు ఒక లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని దాత కుటుంబసభ్యులతో కలసి చెక్ రూపంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డికి అందజేశారు. ఈకార్యక్రమంలో సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్ దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## కల్లూరులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి భారీ షాక్

**కల్లూరు, జూలై 21 ప్రభాతవార్త :** పుంగనూరు నియోజకవర్గంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఎదురు గాలి వీస్తోంది. తాజాగా పులిచర్ల జడ్పీటీసీ, ఎంపిటీసీలు, సర్పంచులు తేదేపాలో చేరారు. పులిచర్ల మండల జడ్పీటీసీ టి.మురళీధర్‌తోపాటు ఉపాధ్యక్షులు రాశీప్రసాద్, ఈశ్వరీగోవర్ధన్, ఎంపిటీసీ సభ్యులు రెడ్డి అహమ్మద్, మంజుల, సర్పంచులు షుకూర్, సరస్వతమ్మ, అమరావతి, రాణి, అనిత, వెంకటేష్, మధు, వైకాపా నాయకులు గోపీనాథ్‌రెడ్డి, ప్రభాకర్, నరసింహులు, మునస్వామి తదితరులు పుంగనూరు నియోజకవర్గ తేదేపా ఇన్‌ఛార్జీ చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో రొంపిచర్ల ఆయన నివాసంలో తేదేపా తీర్థం పుచ్చుకొన్నారు.

## సమాజ మార్గదర్శకులందరూ గురువులే



**పుంగనూరు,జూలై 21 ప్రభాతవార్త:** సమాజానికి సన్మార్గంలో మార్గదర్శకం వహించే వారందరూ గురువులుగా భావించాలని హిందూ సత్యధర్మ దివ్యజ్ఞాన జ్యోతి ఇండియన్‌నేచర్, అండ్‌కల్చర్ ఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు మునెప్పగారి వెంకటేష్ అన్నారు. స్థానిక ఒక ప్రైవేట్ పాఠశాల ఆవరణలో జరిగిన ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పట్టణ ప్రముఖ వైద్యులు పి.ప్రభాకర్, మాజీ కౌన్సిలర్ దేశాది ప్రకాష్, రచయిత మునిరత్నంరెడ్డి, విశ్రాంత తహసీల్దార్ రెడ్డెప్పరాజు,యోగా గురువు జగన్మోహన్‌రెడ్డి, మినికి సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు. ఈసందర్భంగా పట్టణానికి చెందిన భక్తవత్సలరాజు,సిఎస్ రాజారెడ్డిలకు కళారత్న పురస్కారాలు,విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటపతికి తెలుగుభాషాప్రవీణ, ఎన్.రామనాథంలకు సాహిత్యపురస్కారాలు,టిపిఎస్ నాగరాజు,త్రిమూర్తిరెడ్డిలకు విశిష్టసమాజ సేవా అవార్డులు అందించారు.

## దత్తాత్రేయస్వామికి ఘనంగా పూజలు

**పుంగనూరు,జూలై 21 ప్రభాతవార్త:** గురుపౌర్ణమి సందర్భంగా పట్టణంలోని శ్రీ దత్తాత్రేయస్వామి వారి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు.ఈమేరకు ఆదివారం ఉదయం నుంచి యాభైరాళ్ళమరవ వద్ద ఉన్న స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల అధ్వర్యంలో ఆలయం వద్ద ప్రసాద వితరణలు నిర్వహించారు.

## ఆగస్టు 4న సిపిఐ జిల్లా జనరల్ బాడీ సమావేశం

**చిత్తూరు టౌన్, జూలై 21 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా సిపిఐ సర్వసభ్య సమావేశం ఆగస్టు 4వ తేదీన జరుగనుందని జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్.నాగరాజు తెలిపారు. చిత్తూరులో ఆదివారం చిత్తూరు నియోజకవర్గ కార్యవర్గ సమావేశం కె.మణి అధ్యక్షతన జరిగింది. జిల్లా సిపిఐ సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ డి.జగదీష్, పి.హరినాధరెడ్డి, ఓబులేశు, రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యులు రామానాయుడు తదితరులు హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ద్వారకామాయిని తలపించిన చౌడేపల్లి

**చౌడేపల్లి, జూలై 21 ప్రభాతవార్త :**



స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం జరిగిన గురు పౌర్ణమి వేడుకలు మహారాష్ట్రలోని ద్వారకామాయి(షిర్డీ)ని తలపించాయి. ఉదయాన్నే కాకడ హారతితో మొదలై రాత్రి శేజ హారతి వరకు ఆలయంలో భక్తులు కిక్కిరిసి పోయారు. బోయకొండ మాజీ ఛేర్మన్, సాయి బాబా విగ్రహదాత ఎస్కె రమణారెడ్డి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ఎస్కెఆర్ ఆయన సతీమణి రతీదేవి రమణారెడ్డిలు స్వామివారికి సారెను తీసుకొచ్చారు. సాయంత్రం షిర్డీసాయి బాబాను పట్టణంలో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎస్కెఆర్ దంపతులను దుశ్శాలవాలతో సన్మానించారు. షిర్డీసాయిబాబా కమిటీ సభ్యులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆషాడంతో కొండపై పెరిగిన భక్తుల రద్దీ

**బోయకొండ(చౌడేపల్లి), జూలై 21 ప్రభాతవార్త :**

ఆషాడ మాసం కావడంతో శక్తిక్షేత్రం బోయకొండపై భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలివచ్చారు. దీంతో బోయకొండ భక్తజన సంద్రమైంది. అర్చకులచే అమ్మవారికి ఉదయాన్నే విశేషాభిషేకం, అలంకరణగావించారు. ఇఓ, ఉప కమీషనర్ ఏకాంబరం, ఆలయ అధికార, సిబ్బంది యాత్రీకులకు వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసారు.

## గంగమ్మకు రూ. 4లక్షల బంగారు ఆభరణం

**బోయకొండ(చౌడేపల్లి), జూలై 21 ప్రభాతవార్త :**



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు దాత రూ. 4లక్షల విలువ చేయు 51.35గ్రాముల బంగారు ఆభరణాన్ని బహూకరించారు. ఆదివారం ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం, ప్రధానార్చకుడు గంగిరెడ్డిలకు దాత బెంగళూరుకు చెందిన యశ్వంత్‌కుమార్ అందజేసారు.

## కాణిపాకంలో శాస్త్రోక్తంగా సత్యనారాయణవ్రతం



**కాణిపాకం, జూలై 21 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి ఆలయంలో ఆదివారం సత్యనారాయణవ్రతంను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈవ్రతాన్ని నిర్వహించారు. ఆలయ మండపంలో ఈవ్రతాన్ని అర్చకులు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఘనంగా నిర్వహించారు. సత్యనారాయణస్వామి వ్రత మహత్యాన్ని అర్చకులు భక్తులకు వివరించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి పున్నమి గరుడసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో పూతలపట్టు ఎమ్మెల్యే



**కాణిపాకం, జూలై 21 ప్రభాతవార్త:** పూతపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ ఆదివారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆషాడ పౌర్ణమి సందర్భంగా దేవస్థానంలో జరిగిన శాకాంబరి ఉత్సవాల సందర్భంగా ఆయన కాణిపాకం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు వేదమం డపంలో వేదా శీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజే శారు. ఎమ్మెల్యే వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ మదుసూదన్‌రావు, నాయకులు ఎల్‌జీ. బాల,నరసింహులునాయుడు,పూర్ణచంద్రరావు,శేషాద్రినాయుడు, మల్లారపల్లె గిరినాయుడు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## చోరీలు జరగకుండా ప్రత్యేక నిఘా : సిఐ

**వెంకటగిరిరూరల్, జూన్ 21 ప్రభాతవార్త:**

వెంకటగిరి సర్కిల్ పరిధిలోని వెంకటగిరి,బాలాయపల్లి,డక్కిలి, తోపాటు వెంకటగిరి పట్టణ,గ్రామీణ పరిధిలల్లో చోరీలు జరగకుండా తిరుపతి జిల్లా ఎస్పీ గూడూరు డిఎస్పీ ఆదేశాలు మేరకు చోరీలు అరికట్టేందు కోసం రాత్రి వేళలల్లో సిబ్బ ందిచే గట్టి నిఘా తోపాటు గస్తీ ముమ్మరం చేసినట్లు సిఐ సంఘమేశ్వరరావు తెలిపారు.ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లడుతూ వెంకటగిరి పట్టణంలో ట్రాఫిక్ పరిష్కారానికి ప్రతేక్య చర్యలు తీసుకోంటున్నట్లు తెలిపారు.అదే విధంగా చోరీలు పై కూడా గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.రాత్రి వేళలల్లో పట్టణంలో తిరిగే ఆటోలు పోలీస్ స్టేషన్‌లో అనుమతి తప్పనిసరిగా పోందాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 08625-257033,లేదా 9440796348 నంబర్లుకు సమాచారం అందించాలని స్థానిక పట్టణ ప్రజలు పోలీసులకు సహకరించాలని తెలిపారు.

## భక్తి శ్రద్దలతో గురు పౌర్ణమి వేడుకలు

**కోట,జూలై 21 ప్రభాతవార్త :**



కోట మండలంలోని విద్యానగర్, కోట, తిమ్మానాయుడుపాళెం తదితర గ్రామాలల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్దలతో జరిగాయి.సాయి మందిరాల్లో ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామికి క్షీరాభిషేకం చేశారు. భక్తులు సాయిబాబా ఆలయాల్లో అధిక సంఖ్యలో పాల్గొని బాబాకు కీర్తనలు ఆలపిస్తూ భజనలు చేశారు. వారిని దర్శించుకున్నారు.బాబా మందిరాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## అంగరంగ వైభవంగా పుట్టాలమ్మ తిరునాళ్లు

**కోట,జూలై 21 ప్రభాతవార్త :**



సర్వమంగళదాయని, సమస్త మంగళములు, శుభములు ప్రసాదించూ తల్లీ అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. మండలంలోని చెందోడు గ్రామంలో శ్రీపుట్టాలమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అభిషేకాలు విశేష పూజలు చేశారు. ఎటు చూసినా పుట్టాలమ్మ నామస్మరణం, భక్తులు తన్మయంతో పుట్టబంగారం తీసుకొని వచ్చే పాల్గొన్నారు, మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ పుట్ట బంగారం ఘట్టం నేత్ర పర్వంగా ముగిసింది. అనంతరం చల్లా జనార్ధన్ కుటుంభంఅమ్మవారికి పట్టువస్త్రాలు,పుష్పమాలికలు,అభరణాలతోసుందరంగాఅలంకరించారు. అనంతరం పుట్టాలమ్మ కథ ప్రస్దానం చెప్పడం జరిగింది.ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

## అందుబాటులో లేని జికేపల్లి వైద్యులు సిబ్బంది!

**వెంకటగిరిరూరల్, జూలై 21ప్రభాతవార్త:**



వెంకటగిరి మండలంలోని గ్రామీణ ప్రాంతలలోల పేద ప్రజలకు మేరుగైన వైద్య సేవాలు అందించవల్సిన జికేపల్లి ప్రాధమిక వైద్య కేంద్రంలో వైద్యులు,ఆరోగ్య సిబ్బంది అందుబాటు లేక పోవడం దారుణం అని గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రతి నిత్యం గ్రామీణ ప్రాంతల నుంచి అదిక సంఖ్యలో వస్తున్న వైద్య సేవాలు లేక పోవడంతో ఆవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు. ఇక్కడ ఆశ వర్కరు లేక ఒక స్టాఫ్ నర్సు తప్ప మిగిలిన వారు ఎవ్వరు అందుబాటు లేకపోవడం రోగులు సైతం ఆసుపత్రికి రావడం మానివేశారు. గత కొన్ని నెలలుగా జికేపల్లి ప్రాథమిక వైద్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది సక్రమంగా విదులు నిర్వహించడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జిల్లా వైద్యశాఖ అధికారులు చోరవ తీసుకోని జికేపల్లి వైద్య కేంద్రంలో పేదలు మేరుగైన వైద్య సేవాలు అందించాలని స్థానికులు కోతరున్నారు.

## బాబా ఆలయంలో పోటెత్తిన భక్తులు

**వెంకటగిరి, జులై 21, ప్రభాతవార్త :**

పట్టణంలోని సాయిబాబా మందిరాల్లో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులు సాయి బాబామందిరాల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తిరుమల శెట్టి వల్లభ దాస్ తెలిపారు. సాయి బాబా కృప అందరిపై ఉండాలని

## చింతవరం గ్రామం నుంచి జనసేనలోకి యువత చేరిక

**చిల్లకూరు, జులై 21 ప్రభాతవార్త :**



జనసేన సభ్యత్వ నమోదు మహా యజ్ఞ కార్యక్రమంలో నాల్గొవ రోజు ఆదివారం చింతవరం గ్రామంలో క్రియశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన నెల్లూరు జిల్లా ఎన్ఆర్ఐలు పెద్దిశెట్టి వెంకటకిరణ్ కుమార్, చెక్క మనోహర్, జిల్లా సంయుక్త కార్యదర్శి పూసల లక్ష్మి, మలేశ్వర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ వెంకట కిరణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క జనసేన కార్యకర్త, సైనికులు క్రియశీల సభ్యత్వని తీసుకోవాలని ఇలా తీసుకోవడం వల్ల మనం జనసేన కుటుంబంలో భాగమై పార్టీ మరింతగా బలోపేతం అవుతుంది అని, అలాగే సభ్యత్వం చేసుకున్న ప్రతి ఒక్కరికీ కూడా ఎన్ఆర్ఐ విభాగం ఎలాంటి పరిస్థితులలో అయినా తోడుగా ఉంటుందని తెలిపారు. జనసేన పట్టణ నాయకులు పేటేటి చంద్రనీల్ మాట్లాడుతూ చింతవరం గ్రామస్థులు సభ్యత్వ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి జనసేన కుటుంబంలో భాగం అవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మని, కొట్టే రాజేష్, రామయ్య, రాజశేఖర్, సూర్య, మురళి, సుంకర హర్ష, చింతవరం గ్రామ యువత పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**గూడూరు, జులై 21 ప్రభాతవార్త :**



గూడూరు ప్రగతి సేవా సంస్థ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ నందు సుశీల నేత్రాలయకి చెందిన ప్రముఖ డాక్టర్ సుధాకర్ రావు పర్యవేక్షణలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ చేతల మీదుగా ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య కంటి శిబిరం నందు గూడూరు పట్టణ పరిసర ప్రాంతాల నుండి 110 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బండి ధనంజయ రెడ్డి కార్యదర్శి జి. చంద్రశేఖర్, సుశీల నేత్రాలయ కంటి వైద్య నిపుణులు పిఆర్ఓ నాగార్జున ప్రగతి సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు పిడి కరీముల్లా నక్కా రామకృష్ణ, రిటైర్డ్ ఎస్ఐ ప్రభాకర్, కోట వెంకటేశ్వర్లు, ఆక్వా రమేష్, పోతిరెడ్డి పెంచలయ్య, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, వాకాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జెవివి సేవలు అభినందనీయం

**గూడూరు, జులై 21 ప్రభాతవార్త :**



జన విజ్ఞాన వేదిక సేవలు అభినందనీయమని జెవివి ఉపాధ్యక్షులు చెంచు నారాయణ పేర్కొన్నారు. జెవివి ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని బనిగి సాహెబ్ పేట వద్దనున్న పెట్రోల్ బంక్ దగ్గర దివ్యాంగులకు నారాయణ చేతల మీదుగా కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా డాక్టర్ కుడుమల వెంకటనారాయణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, రాధయ్య, గుర్రం విజయబాబు, చెంచునారాయణ, సుబ్బారావు, ఆనంద్, సాయి కిరణ్, శ్రీనివాస ఆచారి, తీరకాల శంకరయ్య, సుధీర్, నారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు

**గూడూరు, జులై 21 ప్రభాతవార్త :**



గూడూరు పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గురు పౌర్ణమి వేడుకల్లో భాగంగా గూడూరు పట్టణంలోని శ్రీ షిరిడి సాయి బాబా మందిరంలో బాబా వారికి పలు రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ ఏర్పాటు చేశారు. మంగళవాయిద్యాలతో బాబా వారికి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. అదే విధంగా గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరులో ఉన్న సాయి బాబాకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసారు.

## మండలంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

**బాలాయపల్లి, జులై 21 ప్రభాతవవార్త :**



మండలంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. మండలంలోని జయంపు, బాలయ్యపల్లి, నిరుగల్లు, మోపూరు తదితర గ్రామంలో ఉన్న శిరిడి సాయి బాబా మందిరంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. సాయి బాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## విశ్రాంత ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

**గూడూరు, జులై 2 ప్రభాతవార్త :**



గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాలలో గురుపౌర్ణమి (వ్యాస పౌర్ణమి) సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు వెంకట రమణారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళి రెడ్డి, సహ కార్యదర్శి మయూరి శ్యామ్ యాదవ్‌లు మాట్లాడుతూ గురు పౌర్ణమి విశిష్టత గురించి వివరించారు. సమాజంలో గురువు యొక్క ఆవశ్యకత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సమితి సహ కార్యదర్శి ఎస్‌వీఎల్ ప్రసాద్ , సిహెచ్ వెంకటరమణయ్య, ఆర్ రవిచంద్రరెడ్డి, రూపేష్ రెడ్డి, ఆర్‌వి రావు, ప్రధానాచార్యులు రంగ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## శంకరమఠంలో ఘనంగా రుద్ర హోమం

**వెంకటగిరి, జులై 21 ప్రభాతవార్త :**



పట్టణం కర్ణకమ్మ వీధిలోని శంకర్ మఠంలో ఘనంగా రుద్రాభిషేకాలు, రుద్ర హోమం నిర్వహించారు. ఆదిశంకరాచార్యులకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలకరించారు. రుద్ర హోమంలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని శంకరమఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు భక్త బృందం తెలిపారు. ఘనంగా శంకరమఠంలో పూజలు నిర్వహించారు.

## చిరు ఉద్యోగులపై వేధింపులు మానుకోవాలి:ఏఐటియుసి

**బాలాయపల్లి, జులై 21 ప్రభాతవవార్త :**



బాలాయపల్లి పిహెచ్‌సిలో పనిచేస్తున్న ఆశా వర్కర్ కృష్ణవేణిని కలిసి ఆమెకు అండగా ఉంటామని చిరు ఉద్యోగులపై వేధింపులు మానుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని వారు ఏఐటీయూసి నాయకులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి, ఆశా వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాముండేశ్వరిలు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూటమి నాయకులు రాష్ట్రంలో చిరుద్యోగులపై ఎలాంటి వేధింపులు ఉండవని ఏ ఒక్కరిని ఏ పనిలో నుంచి తీసివేయమని ప్రజలకు చిరు ఉద్యోగులకు వ్యాపారులకు అండగా ప్రభుత్వం ఉంటుందని చెబుతున్నా స్థానిక నాయకులు మాత్రం చిరు ఉద్యోగులపై వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి వెంకటగిరి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, సిపిఐ మండల రేణిగుంట మండల కార్యదర్శి మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

**తడ, జూలై 21 ప్రభాతవార్త:**



తడ మండలంలోని పలు సాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా భక్తులు విశేష పూజలు చేశారు. మండల పరిధిలోని అండగుండల, బోడిలింగాలపాడు ఆలయాల్లో ఉద యం నుంచి అభిషేకాలు అనంతరం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో సాయిబాబాను దర్శించుకున్నారు.

**శ్రీహరికోటలో...**

శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రంలో ఉన్న కామాక్షి దేవాలయం సముదాయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. పలు శాస్త్రవేత్తలు, అధికారులు, ఇస్రో ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం నుంచే ఆదివారం సెలవురోజు కావడంతో ఎక్కువమంది ఇస్రో కుటుంబ సభ్యులు సైతం ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

**చిట్టమూరు, జూలై 21 ప్రభాతవార్త**



చిట్టమూరు మండలంలోని సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా ఆయా ఆలయాలు విద్యుద్దీపాలంకరణతో పాటు సర్వాంగసుందరంగా ఆలయ కమిటీవారు తీర్చిదిద్దారు. ఆలయ కమిటీ నిర్వాహకులు స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. చిట్టమూరు, మల్లాం, యల్లసిరి గ్రామాల్లో గురుపౌర్ణమి సందర్భంగా భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, అన్నదానం చేశారు.

## జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో గురుపూజోత్సవ మహోత్సవం

తిరుపతి విద్య, జులై 21 ప్రభాతవవార్త :



జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతిలో ఆదివారం వ్యాసపూర్ణిమను పురస్కరించుకుని విశ్వవిద్యాలయంలో వ్యాస భగవానుడి విగ్రహం దగ్గర మొట్టమొదటిగా వ్యాసమహర్షి ప్రతిమకు డా.అవధాని పూజలు నిర్వహించి గురుపూజోత్స వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అద్వైత వేదాంత విభాగ అధ్యక్షులు, ఐక్యూఏసి డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ ఆధ్వర్యంలో ఈ గురుపూజోత్స వం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ వైవి కృష్ణారావు, విశ్వవిద్యాలయంలో విభిన్న విభాగాల అధ్యాపకులు డా. కుమార్, బాగేవాడిమఠ్, డా. మనోజ్ షిండే, డా. నాగరాజు భట్, విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసారు.

## ద్రౌపదమ్మ పుర ఉత్సవం

శ్రీకాళహస్తి, జూలై 21 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తిలో జరుగుతున్న ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్స వాలు సందర్భంగా ఆదివారం ఉదయం ఆలయ ఆవరణలో దుర్యోధన,దుశ్శాసన వధ తరువాత ద్రౌపదీ అమ్మవారి సిగ ముడి వేసిన తరువాత పట్టణంలో భీమసమేత ద్రౌపదమ్మ పట్టణంలో కన్నుల పండువగా ఊరేగించారు. నీళ్ళు లేకపోవటంతో దేవస్థానం టాంకర్లను ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. పోతురాజు ముందువెళుతుండగా గ్రామోత్స వం ఉభయదారులు పి.సుధీర్ బాబు ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహించారు. ఊరేగింపుతో పాటు కార్యక్రమాల్లో ఇఓ ఎన్‌వీఎస్‌ఎన్‌మూర్తి, డిప్యూటీ ఇఓ ఎన్ఆర్.కృష్ణారెడ్డి, ఎసి మల్లికార్జున ప్రసాద్, ఇన్‌ఛార్జి లక్ష్మయ్య పలువురు ఆలయాధికారులుతో పాటు డిఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఉత్స వాల ఇన్‌చార్జి లక్ష్మయ్య,దుర్గాప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేదలకు అన్నదానం

శ్రీకాళహస్తి,జూలై 21 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తిలో గురుపౌర్ణమి సందర్భంగా పలు చోట్ల అన్నదానం జరిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు వచ్చే మార్గంలోని తేరువీధిలోని కైలాస్ గ్రాండ్ అతిధి గృహం నిర్వాహాకులు జయనాయుడు, విజయకుమార్, సుధాకర్, రాంబాబు, అనంద్, రామకృష్ణారెడ్డిలు పేదలకు భారీ ఎత్తున సహాపంక్తి భోజనాలు అన్నదానాలు ఏర్పాటు చేసారు. ఆదివారం తెలుగుగంగ ఇంజనీర్ అనంద్,రఫీ,గోపాల్,తదితరులు అన్నదానం జరిపారు. అదే విధంగా గురుపౌర్ణమి సందర్భంగా బజారువీధిలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం వేలాది మందికి అన్నం ప్రసాదాన్ని వేలాది మందికి అందించారు. కమిటి యువజన కమిటి సభ్యులు సేవలందించారు.

## రాంబట్లపల్లిలో భక్తిశ్రద్దలతో గురుపౌర్ణమి వేడుకలు

తొట్టంబేడు, జూలై 21 ప్రభాతవార్త:



గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని కాసరం పంచాయతీ రాంబట్ల పల్లి గ్రామంలో వెలసిన పాలరాతి షిరిడిసాయిబాబా మందిరంలో స్వామి వారికి ఉదయం నుంచి సాయిబాబాకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించి అలంకరణ నిర్వహించారు. అనంతరం హైదరాబాదుకు చెందిన మిమిక్రీ, డబ్బింగ్ ఆర్టిస్, ఇంద్రజాలికుడు, వెంట్రి లాక్విజం కళాకారుడు హరిప్రసాద్ మరియు మిమిక్రీ కళాకారుడు గౌతమ్ చంద్రల ఆధ్వర్యంలో వెంటిలాక్విజం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మధ్యహ్నాం ఆలయ ధర్మ కర్తలు కన్నమ్మ, సింగిల్‌విండో మాజీ ఛైర్మన్, ఆలయ ధర్మకర్తలు కె.మహదేవరెడ్డిల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి షిరిడిసాయినాధుని చిత్రపటం గ్రామోత్స వంతో పాటు తిరుపతికి చెందిన శ్రీరామంజనేయయుద్ధం పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. కాగా గ్రామానికి చెందిన యువనాయకుడు కె.భరత్‌రెడ్డి దంపతులు సాయినాధుని దర్శించుకున్నారు. .

## నృత్యం..రసరమ్య భరితం

–ఆకట్టుకున్న చిన్నారుల నృత్యప్రదర్శన

తొట్టంబేడు,జూలై 21 ప్రభాతవార్త :



నృత్యం.. రసరమ్య భరితం.. గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని రాంబట్లపల్లిలో షిరిడిసాయినాధుని ఆలయ ధర్మకర్త కె.మహదేవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈనేపధ్యంలో పట్టణానికి చెందిన ఆషానృత్యబృందంకు చెందిన చిన్నారి కళాకారులు చష్మిత,సుదీక్ష, మంజుశ్రీ, ప్రత్యూష, చరిష్మ, చరణి, హారిక, మానసలు చక్కగా భక్తిగేయాలకు నృత్యప్రదర్శన చేయడంతో గ్రామస్తులు అభినందించారు.

## సాయినాధుని ఆలయంలోకిటకిటలాడిన భక్తులు

శ్రీకాళహస్తి, జూలై 21 ప్రభాతవార్త :



పట్టణంలోని చెన్నైరోడ్డులో వెలసి ఉన్న షిరిడిసాయినాధుని ఆలయంలో శనివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సాయినాధునికి కాగడా హారతితో ప్రారంభమై 108 అష్టోత్తర శతకలషాభిషేకం, హారతులను నిర్వహించి అత్యంత భక్తి శ్రద్దలతో స్వామివారిని విశేషాలంకరణ చేపట్టారు. ఆలయ అర్చకులు శశిధరశర్మ మరియు ఆలయ కమిటీ సభ్యులు జగదీష్‌లు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆషాడ శుద్ధ పౌర్ణమి రోజున గురుపౌర్ణమి జరుపుకుంటారని ఆలయ కమిటీ తరపున నేడు గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో వెలసిన స్వామివారికి విశేషాలంకరణ చేపట్టారు.

## కర్నాలవీధిలోని బాబాకు విశేషాలంకరణ

శ్రీకాళహస్తి, జూలై 21 ప్రభాతవార్త:



శనివారం గురుపౌర్ణమి సందర్భంగా షిరిడి సాయినాధుని ఆలయంలో వేడుక గా గురుపౌర్ణిమ వేడుకలను నిర్వహిం చారు. కర్నాలవీధిలోని బాబాకు ఆలయ అర్చకులు అచ్యుతస్వామి, నిర్వాహకులు జూలుగంటి గోపి, జూలుగంటి లక్ష్మిల ఆధ్వర్యంలో ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్ధప్రసాదాలను అందించారు. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి విశేషసంఖ్యలో హాజరవడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

## భక్తులకు దేశం ఆధ్వర్యంలో అన్నదానం

శ్రీకాళహస్తి, జూలై 21 ప్రభాతవార్త :

ధర్మరాజుల తిరునాళ్ళలో భాగంగా ఆలయం వద్ద పట్టణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకాళహస్తి పట్టణంలో ధర్మరాజుల తిరునాళ్ళంటే ఎంతో ప్రసిద్దిచెందింది. పట్టణానికే కాకుండా పలువురు చుట్టుపక్కల గ్రామాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు వస్తుంటారు. శనివారం అగ్నిగుండ మహోత్స వానికి కంకణాలు ధరించిన భక్తులు విశేష సంఖ్యలో హాజరై అగ్నిగుండ మహోత్స వంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గుత్తావిజయకుమార్‌నాయుడు, మధు పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## నెహ్రూ నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

**తిరుపతి హెల్త్, జులై 21 ప్రభాతవార్త :** తిరుపతిలోని స్థానిక నెహ్రూ నగర్‌లో గల శ్రీ రాజ రాజేశ్వరి దేవాలయం వద్ద రేవా దయాబి టీస్ క్లీనిక్ అధినేత డాక్టర్ కత్తుల రేఖ ఆధ్వర్యం లో పేద ప్రజలకు ఉచితంగా వైద్యము నిర్వహిం చడం జరిగిందన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 500 మంది పాల్గొన్నారు. వారికి ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ కత్తుల రేఖ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీ, వంటి జబ్బులు తీవ్రబారం దాల్చకుండా వుండడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అప్రమత్తం చేసారు. స్థానిక బిజెపి నాయకులు పొన్నగంటి భాస్కర్, కొండేటి ప్రేమ్ కుమార్, జనసేన నాయకులు హరి, తెలుగుదేశం పార్టీ నాయకులు మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ ద్రౌపదీదేవి ఆలయంలో అన్నదానం

పుత్తూరురూరల్, జూలై 21 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.అనంతరం మధ్యాహ్నాం భక్తులకు పుత్తూరు పట్టణానికి చెందిన స్వామి వివేకానంద హైస్కూలు కరస్పాండెంట్ సదాశివం కుటుంబ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## గ్రామ దేవత ఆరేటమ్మకు ఊయల వితరణ

పుత్తూరురూరల్, జూలై 21 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణం కార్వేటినగరం రోడ్డులో వెలసిన గ్రామదేవత శ్రీ ఆరేటమ్మ దేవాలయానికి ఆదివారం పుత్తూరు పట్టణానికి చెందిన రవికుమార్, లోకేశ్వరి దంపతులు ఊయలను వితరణగా అందించారు. దీని విలువ ఇరవై అయిదువేల రూపాయలు ఉంటుందన్నారు. ఆలయ నిర్వాహకులకు ఈ ఉయాలను అందజేశారు.

## అనుచిత వ్యాఖ్యలు చేసిన చెవిరెడ్డి క్షమాపణలు చెప్పాలి

పుత్తూరురూరల్, జూలై 21 ప్రభాతవార్త:



వెనుకబడిన తరగతుల ఆర్థిక, రాజకీయ, సాధికారత కోసం ఆవిర్భవించిందే తెలుగుదేశం పార్టీ అని తెలుగుదేశం పార్టీ ఒక బీసీ నాయకుడిని గుర్తించి జిల్లా పార్టీ అధ్యక్షుని చేస్తే స్వాగతించాల్సింది పోయి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిఫార్సు మేరకే తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్ష స్థానాన్ని సీఆర్ రాజన్‌కి కట్టబెట్టారని చెవిరెడ్డి దిగజారిన రాజకీయానికి నిదర్శనమని టీడీపీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి పేర్కొన్నారు. సీఆర్ రాజన్ పెద్దిరెడ్డికి ప్రియ శిష్యుడు అయితే మరి వైసీపీలో శాసన సభ టికెట్ ఎందుకు ఇవ్వలేదో చెవిరెడ్డి సమాధానం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పుత్తూరు పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు ఏళుమలైరెడ్డి, జిల్లా టీఎన్‌టీయూసీ కార్యదర్శి పండారం మణి, పుత్తూరు పట్టణ బీసీసెల్ ఉపాధ్యక్షులు సంతోష్, 2వ వార్డు ఇన్‌చార్జి కాశీ, చిదంబరం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గురుపౌర్ణమి పూజలు

విజయపురం, జూలై 21 ప్రభాతవార్త:



మండలంలో గురు పౌర్ణమి పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ పూజల్లో భాగంగా జగన్నాథపురం శ్రీరామనామ క్షేత్రంలో రాంప్రసాద్‌శర్మ, విజయపురం, కొత్త ఇళ్ళత్తూరులో వీరబ్రహ్మస్వామి ఆలయంలో పురోహితులు వందవాసి మహేష్‌శర్మ హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి హరికథ కాలాక్షేపం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## ఎం అగరంలో రోడ్లకు మోక్షం

విజయపురం, జూలై 21 ప్రభాతవార్త:



మండలంలోని ఎం అగరంలో రోడ్లకు మోక్షం కలిగింది. గ్రామంలో తుడా నిధులతో సిమెంటు రోడ్డు నిర్మాణం చేయడంతో గ్రామంలో రోడ్డు సమస్య పరిష్కారం అయిందని గ్రామస్తులు తెలిపారు. రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## అటవీ ప్రాంతంలో కల్కి కట్టిన కట్టడాలను కూల్చివేయాలి

తిరుపతి హెల్త్, జులై 21 ప్రభాతవార్త :



వరదయ్యపాలెం ప్రాంతంలోని అటవీ భూముల్లో కల్కి ఆశ్రమ అధినేత కట్టిన కట్టడాలను వెంటనే ప్రభుత్వం కూల్చి వేయాలని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు నార్ని వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో డాక్టర్ ఏఆర్ రెడ్డి, కల్కి బాధితులు చంద్రశేఖర్, రాజయ్య, పోలయ్య తదితరులతో కలిసి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ బిఎన్ కండ్రిగ కల్లిపెట్టు గ్రామం దగ్గర అంజూర్ రిజర్వ్ ఫారెస్టు సర్వే నెంబర్ 295లో దాదాపు 21 ఎకరాలు ఆక్రమించుకుని పర్మినెంట్ కట్టడాలు కట్టారని ఆరోపణ చేశారు. దీని వలన కొందరు పేద రైతులు భూములు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ కట్టడాలను కూల్చేసి, దీనికి సంబంధించి కల్కికి సహకరించిన రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు.

## జగన్ పాలన అంతానికి ఐదేళ్ళు... కూటమికి ఐదు మాసాలే!

–కాంగ్రెస్ నేత తులసి రెడ్డి

తిరుపతి హెల్త్, జులై 21 ప్రభాతవవార్త :



జగన్ పాలక అంతానికి ఐదేళ్ళు పడితే కూటమికి ఐదు మాసాలే అని కాంగ్రెస్ నేత తులసిరెడ్డి పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మీడియా ముందు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రమీలమ్మ, మాంగాటి గోపాల్ రెడ్డి తదితరులతో కలిసి తులసి రెడ్డి మాట్లాడుతూ వైసిపి పాలనలో గంజాయి, మత్తు మారకద్రవవ్యాలు నేటికి కూటమి పాలన వచ్చాక కూడా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. దీని వలన దాడులు, హత్యలు, మానభంగాలు జరుగుతున్నాయన్నారు. దేశంలో బిజెపి బలహీన పడిందని చిన్న చిన్న ప్రాంతీయ పార్టీలకు కలిసి నత్త నడక భాజాపా నడుస్తున్నదని విమర్శించారు. గత కాంగ్రెస్ పాలనలో మొదలైన పోలవరం, దుగ్గరాజు పట్టణం ఓడరేవు ప్రాజెక్టులను విస్మరించడం బాధాకరమ న్నారు. త్వరితగతిన రాష్ట్రంలో కూటమి పాలనలో భారీ మార్పు రాకుంటే ఏపీ సర్వనాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు ఎన్నికల్లో చెప్పి సూపర్ సిక్స్ వాగ్దానాన్ని అమలు పరిస్తే కాంగ్రెస్ అభినందనలు కూటమికి ఉంటాయన్నారు. మిగతా ఇచ్చిన ఎన్నో వాగ్దానాలు అమలు పరచడంలో ఎలా పనిచేస్తుందో వేచి చూడాలన్నారు. దేశం కాంగ్రెస్ పాలనతోనే సుభిక్షంగా ఉంటుందని కొనియాడారు. ఎప్పటటికైనా కాంగ్రెస్ పార్టీ పాలన వస్తుందని జోష్యం చెప్పారు.

## శ్రీ గౌరీ శంకర స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ చే అన్నదానం

తిరుపతి హెల్త్, జులై 21 ప్రభాతవవార్త :



ముత్యాల రెడ్డి పల్లిలో వెలసిన శ్రీశ్రీశ్రీ గౌరీ శంకర స్వామివారి దేవస్థానం ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చంద్రయ్య, శ్రీరాములు, కార్యనిర్వాహకులు సాయి, రాజశేఖర్ నాయుడు, జ్యోతిశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలసిన గురవారెడ్డి

శ్రీకాళహస్తి,జూలై 21 ప్రభాతవార్త :



తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునా యుడును రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి అమరావతిలోని పార్టీ కార్యాల యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను పూర్తి సమాచారాన్ని నివేదిక రూపంలో సిఎంకు అందించారు.

# తిరుపతి డివిజన్

## వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

–ఎంఎల్ఏ పులివర్తి దంపతులకు ఘన స్వాగతం

చంద్రగిరి, జూలై 21 ప్రభాతవార్త:



స్థానిక పాతపేటలోని శ్రీ షిరిడి సాయి బాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఎంఎల్ఏ పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డి దంపతులు హాజరు కాగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారెను అందజేశారు. ఎంఎల్ఏగా పులివర్తి నాని విజయం సాధించాలని అమ్మవారిని వేడుకున్న వసంత నాయుడు, రాణి దంపతుల కుమారుడు హరిప్రసాద్ నాయుడు అమ్మవారికి 2,50,116/- లను పులివర్తి దంపతుల చేతులమీదుగా ఆలయ పునర్నిర్మాణానికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, సింగు సుధ, మొక్కల కుమార్‌రాజారెడ్డి, వీరంగారి రమేష్ రెడ్డి, ఏజిపల్లి బాల, శివకోటిరెడ్డి, కొండూరు ప్రవీణ్ రాయల్, శానంబట్ల తులసిరెడ్డి, సక్కుర్ ధనంజయ రెడ్డి, పులికంటి మోహన్ రెడ్డి, లంకెళ్ళ లలిత, గౌస్‌భాషా, రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, అమ్ములు, భూలక్ష్మి, ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ

నగరి, జూలై 21 ప్రభాతవార్త:



స్థానిక లయన్స్‌క్లబ్ నిర్వాహకులు వీధి వ్యాపారులకు నీడ కోసం గొడుగులు పంపిణీ చేశారు. ఆదివారం నగరి అనేక ప్రాంతాల్లో చిరు వ్యాపారం చేసుకునే వారికి గొడుగులు అందించారు. ఈ సందర్భంగా నగరి లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు రాజరాజేశ్వరి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ద్వారా ఆదరణ నోచుకోని వారికి, నిరాశ్రయులకు పలు సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్స న్ హెచ్.ప్రభాకర్‌రాజు, డైరెక్టర్ హరి ప్రసాద్‌వర్మ, మాజీ అధ్యక్షులు ఏ.మోహన్, సభ్యులు రామ్మోహన్, మహ్మద్ షఫీ, దేవన్, పొన్ను రంగం తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

నగరి, జూలై 21 ప్రభాతవార్త:



పట్టణ పరిధి బేరివీధిలోని శ్రీ సాయిరాం మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. షిరిడీ సాయిబాబా విగ్రహానికి భక్తులు స్వహస్తాలతో పాలాభిషేకం చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. భక్తులు పాలాభిషేక మహోత్స వానికి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆలయం వద్ద అన్నదానం చేశారు. అడ్వకేట్ మురళీధర్, లీలావతమ్మ, సావిత్రమ్మ, భాస్కర్ ఆచారి, గీతమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు పలువురు సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

## పెద్దజీయర్ చాతుర్మాసదీక్ష ఆరంభం

తిరుమల, జులై 21ప్రభాతవార్త:



ఆషాడ శుద్ధఏకాదశి పురస్కరించుకుని చాతుర్మాస దీక్షలను టిటిడి పెద్దజీయరు స్వామి ఆదివారం చేపట్టారు. టిటిడి ఈఓ జె.శ్యామలరావు, .జఈఓ వీరబ్రహ్మం అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు.



## వెంకన్న సేవలో ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల,జులై 21ప్రభాతవార్త :

తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమల పుణ్యక్షేత్రం తిరుపతి జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు.

## గంగమ్మ ఆలయంలో ఛండీహోమం

తిరుపతిటౌన్, జులై 21ప్రభాతవార్త:



తిరుపతినగర గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఆదివారం వ్యాస పూర్ణిమ సందర్భంగా ఉదయం చండీ హోమం నిర్వహిం చారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ హో మంలో అర్చకులు శాస్త్రోక్తంగా వేదమంత్రో చ్చర ణలనడుమ గృహస్థభక్తులతో జరిపించారు. అనం తరంభక్తులకు హోమ ప్రసాదం పంపిణీచేశారు. గంగమ్మ దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఆధ్యాత్మికనగరంలో...వేడుకగా గురుపౌర్ణిమ

–భక్తులతో కిటకిటలాడిన సాయిబోబా ఆలయాలు

తిరుపతిటౌన్, జులై 21ప్రభాతవార్త:



ఆధ్యాత్మికనగరం తిరుపతిలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈసందర్భంగా ఆదివారం వేకువజామున నగరం లోని షిర్డీసాయిబాబా ఆలయాలన్నీ తెరచుకున్నాయి. సాయిబాబాకు సాంప్రదాయంగా ప్రత్యేక అభిషేకాలు,పూజలు నిర్వహించారు. భక్తులకు దర్శనమ్ చేయించి బాబా తీర్థప్రసాదాలు అందజేశారు. నగరంలోని కొంకావీధిలో ఉన్నషిర్డీసాయిబాబా ఆలయం, దేవేంద్రథియేటర్ మార్గంలోని సాయిబాబా ఆలయం, ఆర్‌సిరోడ్డులోని బాబా ఆలయం, పల్లెవీధిలోని సాయిబాబా ఆలయాలన్నీ భక్తులతో ఉదయం నుండి రాత్రి వరకు రద్దీగా మారాయి. ఆలయ నిర్వాహకులు బాబా ఆలయాలను పుష్పాలతో ముస్తాబుచేసి, భక్తులకు ప్రశాంత దర్శనం చేయించారు.

## గురుపౌర్ణమిన గరుడసేవ వీక్షణం

తిరుమల, జులై 21ప్రభాతవార్త :



గురుపూర్ణిమ సందర్భంగా ఆదివారంరాత్రి తిరుమల వేంకటేశ్వరస్వామి ఉత్స వమూర్తి మలయప్పస్వామి గరుడవాహనంపై భక్తులను కటాక్షించారు. 108 దివ్యదేశాలలో గరుడ సేవకు అత్యంత విశిష్టత ఉంది. ఆలయ మాఢవీధుల్లో భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర హారతులిచ్చారు.

## పుత్తూరు మండల బలిజ సంఘ సమావేశం

పుత్తూరురూరల్, జూలై 21 ప్రభాతవార్త:

పుత్తూరు మండలం బలిజ సంఘం అధ్యక్షుడు పసుపులేటి శివయ్య అధ్యక్షతన సంఘ సమావేశం ఆదివారం జరిగింది. పుత్తూరు పట్టణంలో నూతనంగా బలిజసంఘం భవన నిర్మాణం పూర్తయిన తరుణంలో సంఘ భవనం ప్రారంభోత్స వం ఆగస్టు 9వ తేదీన ప్రారంభించాలని అందరూ ఆమోదం తెలిపారు. అలాగే పుత్తూరు శ్రీ ద్రౌపదీదేవి ధర్మరాజుల తిరుణాళ్ళలో బలిజ కులస్తుల ఆధ్వర్యంలో జరుగు అలుగు ఉత్స వం గురించి చర్చించి ఘనంగా అలుగు ఉత్స వాన్ని చేయాలని అందరూ ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలోని పట్టణంలోని బలిజ కులస్తులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని వారి అభిప్రాయాలు తెలియజేశారు. సమావేశంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

## సాయిబాబాకు మహాభిషేకం

పుత్తూరురూరల్, జూలై 21 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని టీబీ రోడ్డులో వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా స్వామివారికి మహాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం కాకడ హారతి(ప్రభాత హారతి), మహాభిషేకం ప్రత్యేక అభిషేకాలు, శ్రీ గురు చరిత్ర పారాయణం, మధ్యాహ్నాం హారతి అనంతరం మహా అన్నదానం , సాయంత్రం సంధ్య హారతి, రాత్రి వైభవంగా ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

# కాణిపాకంలో వైభవంగా శాకాంబరి అలంకారం

-15 టన్నుల కూరగాయలు, పండ్లు వినియోగం





స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించే ందుకు ఊరేగింపుగా తీసుకువెళుతున్న దృశ్యం

కాణిపాకం, జూలై 21 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం ఆషాడ పౌర్ణమి సందర్బంగా ఆదివారం శాకాంబరి అలంకారంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కాణిపాకంలో 2022 నుండి ఆషాడ పౌర్ణమి సందర్బంగా శాకాంబరి అలంకారంను దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాయలంలో నిర్వహిస్తు న్నారు. ఈఏడాది మణికంఠేశ్వరాలయంతో పాటు ప్రధాన ఆలయంలో కూడా శాకాంబరి అలంకారంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ప్రధాన ఆలయంలోని అంత్రాలయం, అర్దమండపం, బంగారు ధ్వజస్థంభం, అద్దాల మండపంలను వివిధ రకాల కూరగాయలు పండ్లుతో సర్వాంగ సుందర ంగా అలంకరించారు అలాగే మణికంఠేశ్వరాలయంలోని శ్రీమరగదాంభిగా దేవి, దుర్గాదేవి అమ్మవార్లతో పాటు ఆలయ మండపాలను వివిధరకాల కూరగాయలు, పండ్లుతో శాకాంబరి అలంకారంను నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

**స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రసాల సమర్పణ :**

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాయలంలో నిర్వహించిన శాకాంబరి అలంకారం సందర్భంగా దేవస్థానం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ ఎ.వెంకటేశు, అధికారులు కలసి ప్రధాన ఆలయం నుండి పట్టు వస్త్రాలను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా మణికంఠేశ్వరాలయంకు తీసుకువెళ్ళి సమర్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, ఐరాల మండల టీడీపీ అధ్యక్షుడు మల్లారపల్లె గిరినాయుడు, స్థానిక టీడీపీ నాయకులు పూర్ణచంద్రరావు, శేషాద్రినాయుడు, ఎల్‌జి.బాల, హేమాద్రి నాయుడులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## శ్రీచెంగాళమ్మకు బంగారు వడ్డాణం బహూకరణ



సూళ్లూరుపేట, జూలై 21 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరిదేవికి సూళ్లూరుపేటకు చెందిన చెంబేటి సతీష్‌బాబు, సురేఖ దంపతులు ఆదివారం బంగారు పూతతో కూడిన వడ్డాణాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లుకు అందజేశారు. 197 గ్రాముల వెండి, 300 మిల్లీగ్రాముల బంగారు, 29 గ్రాముల 665 మిల్లీగ్రాముల బరువుగల ఈ బంగారు పూత గల వడ్డాణాన్ని అమ్మణ్ణికి భక్తిపూర్వకంగా సమర్పించామని దాత చెంబేటి సతీష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, మేడా సాయి నారాయణ, ఇవి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆమ్మో... మున్సిపాలిటి నీరా!

-తాగు నీరు కలుషితం కారణంగానే విష జ్వారాలు -మంచి నీరు వచ్చే పైపు లైన్లు అన్ని లీకులే -మురికి నీటిలో తాగునీరు కుళాయిలు

వెంకటగిరిరూరల్, జూలై21ప్రభాతవార్త: వెంకటగిరి మున్సిపాలిటి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఎమ్మెల్యే కురుగండ్ల రామకృష్ణ ఆలోచనకు అనుగుణంగా పనిచేయాల్సిన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వల్ల పట్టణ ప్రజలు తాగే నీరు కలుషితంగా మారుతుందనే విమర్శలు పట్టణంలో అధికంగా వినిపిస్తున్నాయి. సమ్మర్ స్టోరేజి నుంచి పైపుల్ లైన్ ద్వారా వచ్చే తాగు నీరు లీకులు ఉండటంతో త్రాగు నీరు కలుషితంగా మరుతున్నయని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంతే కాదు కనీసం ట్యాంక్‌లు ను సైతం శుభ్రం చేసి సంవత్సరాలు గడుస్తుంది. ట్యాంకులు పరిశుభ్రంగా లేక పోవడంతో త్రాగు నీరులో పురుగులు వస్తున్నట్లు ఆరోగ్య సిబ్బంది ఇంటింటి పరిశీలినలో తెలింది. తాగు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవల్సిన అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

## అర్ధగిరిలో వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



తవణంపల్లె, జూలై 21 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ప్రతి నెలా ఆలయంలో పౌర్ణమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఆలయ ఈఓ హనుమంతురావు ఆధ్వర్యంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈమేరకు అలంకరించిన స్వామివారిని ప్రత్యేక పల్లకిపై వుంచి ఆలయం, సంజీవరాయని పుష్కరిని చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. భక్తులకు అన్నదానం నిర్వహించడంతో పాటు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# తనిఖీలు లేవు... ఎవరడిగనా ఇచ్చేస్తారు !

-ఇది సత్యవేడులో పురుగుల మందుల షాపుల యాజమాన్యం తీరు



సత్యవేడు, జూలై21 ప్రభాతవార్త: సత్యవేడు మేజర్ పంచాయతీలో క్రిమి సంహారక మందుల షాపుల యాజమాన్యం తీరుపై పలువురు మండిపడుతు న్నారు. ప్రధానంగా కొన్ని షాపుల్లో నకిలీ మందులను విక్రయించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొన్నిచోట్ల కాలం చెల్లిన మందుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. సొంతంగా పెట్టుబడులు పెట్టలేని రైతులు విధిలేక షాపుల యాజమాన్యం వద్ద అప్పులు చేసి మందులు కొనుగోలు చేసుకుని వెళ్ళిపోతు న్నారు. విధిగా బిల్లులు ఇవ్వాల్సిన అవసరం ఉన్నా వాటి విషయాలను షాపుల యాజమాన్యం అటకెక్కించాయి. ఇటీవల మామిడి రైతాంగం కూడా ఇప్పుడు మందుల షాపుల యాజమాన్యం వల్ల నష్టపోయారని సమాచారం. పూతకోసం,దిగుబడికోసం షాపుల వారు ఇచ్చే మందులను పలుమార్లు మామిడి తోటలకు పిచికారి చేసినా ప్రయోజనం శూన్యం. ఇక వరి సాగు చేస్తున్న రైతులు కూడా అధిక దిగుబడి, చీడపీడల నుంచి రక్షణ కొరకు మందులు వాడుతున్నారు. షాపు యాజమాన్యం ఇచ్చే నాలుక భరోసాతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. 100 ఎంఎల్ మందులు కొనుగోలు చేసినా విధిగా బిల్లులు ఇవ్వాలి. ఈ అంశాన్ని సత్యవేడు పట్టణంలోని షాపులవారు అటకెక్కించారు. కొందరైతే షాపులు ఒకచోట, దూరప్రాంతంలో మందుల స్టాకును ఏర్పాటు చేసుకుని అనధికారికంగా విక్రయిస్తున్నారు. అన్నీ తెలిసినా అధికార యంత్రాంగం మాత్రం ఆకస్మిక తనిఖీలను చేయడం మరిచిపోయారని వాపోతున్నారు. రైతులు కాకుండా ఎవరు వచ్చి అడిగినా వెంటనే షాపుల యాజమాన్యం గడ్డిమందులను వారి చేతిలో పెట్టేస్తున్నారు. మరుసటి రోజు ఎవరో ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారాలు వస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు ఇటీవల సత్యవేడులో చోటు చేసుకుంది. షాపుల్లో ఓనర్లు ఉండటం లేదు, ఎవరుపడితే వారు ఉంటూ ఎవరు వచ్చి అడిగినా వెంటనే మందులు ఇవ్వడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఈ విషయాలపై పూర్తి అవగాహన ఉన్నా సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై పలు అనుమాలకు తావిస్తోందని స్థానికులు భావిస్తున్నారు.

## జిల్లా మెసెంజర్ల నూతన కార్యవర్గం ఎన్నిక



తొట్టంబేడు, జూలై 21 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా మెసెంజర్ల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాళహస్తి ఆర్‌పిబిఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర మెసెంజర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పాటూరు రవి, ఈ.శివకుమార్‌ల ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా మెసెంజర్ల కార్యవర్గం ఎంపికచేశారు. అధ్యక్షులుగా మునిరత్నం (జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం, తిరుపతి), ఉపాధ్యక్షులుగా ఎ.పెంచలయ్య (పెళ్ళకూరు), ప్రధాన కార్యదర్శిగా కెవి.ప్రశాంత్(శ్రీకాళహస్తి), సంయుక్త కార్యదర్శిగా డి.హేమలత(కెవిబిపురం), ట్రెజరర్‌గా కె.సుబ్రమణ్యం (బిఎన్ కండ్రిగ), సంయుక్త ట్రెజరర్‌గా ఎస్.షాహిన, గౌరవాధ్యక్షులుగా జి.ఆనంద్ మరియు కార్యవర్గ సభ్యులుగా ఎన్.హరి నారాయణ ఆచారి, కుమార్, పిడి.వాసు, వి.శివకుమార్, విజయుడు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు మరియు జాకీంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు. ప్రధాన కార్యదర్శి కెవి.ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లాలో మెసెంజర్ల సమస్యల పరిష్కారానికి అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు జిల్లాలకు చెందిన మెసెంజర్లు పాల్గొన్నారు.

## ధర్మరాజుల స్వామి ఆవరణలో హోరెత్తిన జనం

-పొంగళ్ళతో తీర్చుకున్న మొక్కులు



శ్రీకాళహస్తి, జూలై 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు, పట్టణానికి చెందిన పలు ప్రాంతాలకు చెందిన మహిళలు తండోపతండాలుగా తరలి వచ్చారు. ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళా భక్తులు పొంగళ్లు పెట్టుకోవటానికి విశేష సంఖ్యలో వచ్చారు. ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలంటే చుట్టపక్కల గ్రామాల ప్రజలకు తిరునాళ్ళుగా ప్రసిద్ధి చెందింది. ప్రతి ఏడాది ఇక్కడ దుర్యోధన దుశ్శాసన వధ సందర్బంగా పొంగళ్ళు పెట్టడం ఆనవాయితి. ఈ ఏడాది వేలాది మంది మహిళలు పొంగళ్ళు పెట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం అంతా మహిళా భక్తుల పొంగళ్ళతో కిట కిట లాడింది. పొంగళ్ళు సందర్భంగా ఆలయాధికారులు ముందుజాగ్రత్తగా పలు ఏర్పాట్లు చేశారు. ఇక పోలీసు అధికారులు ముందుజాగ్రత్తగా పిచ్చాటూరు నుంచి వచ్చే బస్సుల్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్ వద్ద చెన్నై వైపు నుంచి వచ్చే వాహనాల్ని సాయిబాబా సన్నిధి నుంచి ఆర్‌టిసి బస్టాండుకు మళ్ళించారు. ఏర్పాట్లను ఆలయ ఇఓ ఎన్‌వియస్‌ఎన్ మూర్తి కొత్త కాబట్టి ఆయనే స్వయంగా పర్యవేక్షించారు. ఆయనతో పాటు,డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఇఇ నూకారత్నం, డిఇఇ శ్రీనివాసులురెడ్డి,ఎసి మల్లికార్జున్ ప్రసాద్ స్థపతి కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రసాదాల్ని ఆలయం వద్దకు తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.ఎటు చూసినా గ్రామాల నుంచి వచ్చిన వారు బుట్టగిన్నెల్లో బలి ఇచ్చిన కోళ్ళను తీసుకెళ్ళటం కనబడింది.

## అప్పలాయగుంటలో వైభవంగా అంకురార్పణ



వడమాలపేట, జూలై 21 ప్రభాతవార్త: అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం నిర్వహించనున్న పుష్ప యాగంకు ఆదివారం సాయంత్రం అంకురార్పణ జరిగింది. ఆదివారం వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. మాడవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపుగా సేనాధిపతి ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పుట్టమట్టిని ఆలయం నుంచి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు పుట్టమట్టిని మేదినీదేవి రూపంలో అలంకరింపచేసి మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మహా గోపురం వద్ద వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అంకురార్పణ గావించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, అర్చక బృందం, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీచెంగాళమ్మ దేవస్థానంలో గురుపౌర్ణమి ఉత్సవాలు



సూళ్లూరుపేట, జూలై 21 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరి దేవస్థానంలో ఆషాఢమాసం గురుపౌర్ణమిని పురస్కరించుకొని అమ్మ వారికి చండీయాగం, కలశాభిషేకాలను అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, కోమలి దంపతులు ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉదయం దేవస్థానం ప్రాంగణంలోని యాగ మండపం వద్ద గోపూజతో చండీ యాగాన్ని ప్రారంభించి మధ్యాహ్నం వేదపండి తుల మంత్రోచ్చరణల మధ్య పూర్ణాహుతి సమర్పించి యాగాన్ని ముగించారు. అనంతరం అమ్మణ్ణి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేకంగా అమ్మణ్ణి సన్నిధిలో ఉంచి పూజలు నిర్వహించిన 108 కలశాల్లోని పవిత్ర జలాలతో కలశాభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్ర మాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, కురుగొండ్ల రామకృష్ణ, పాశిం సునీల్‌కుమార్, మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, మేడా సాయినారాయణ, చిట్టేటి పెరుమాళ్లు, మాధవ నాయుడు, అలవల శ్రీనివాసులు, వేమసాని శ్రీనివాసులు నాయుడు, బొమ్మన్ శ్రీధర్, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**షిరిడీసాయి ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు:**

ఆషాఢ గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని షిరిడీసాయి ఆలయాలతో పాటు చిత్రకుటంలోని సాయిమందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఆర్ఎంబి భాస్కర్‌బాబు, రాధా దంపతులు, బాలయ్య దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## శ్రీకృష్ణాశ్రమం స్వాములను సత్కరించిన కోలా



శ్రీకాళహస్తిరూరల్, జూలై 21 ప్రభాతవార్త : ఏర్పేడు మండలం బండారుపల్లి గ్రామంలో వెలసిన ఆధ్యాత్మిక కేంద్రం శ్రీ కృష్ణాశ్రమం 45వ వార్షికోత్స వం సందర్భంగా పలు ఆశ్రమాల స్వాములను బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ సత్కరించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆశ్రమంలో పీఠాధిపతి సదానంద స్వామితో పాటు రామకృష్ణానందస్వామి, శివానందగిరి స్వామి, వాసుదేవా నందస్వామి, నారాయణానందగిరిస్వామి,బ్రహ్మానందగిరి స్వామి, పాదుకాకామేశ్వరానందస్వామి, జయదేవానందస్వామి, నాగేంద్రమ్మ మాతాజి,శివా స్వామి, గణేష్‌స్వామి,పురుషోత్తవానందగిరి స్వామి, స్వామి ఓం ప్రకాస్, విశ్వానంబరస్వామి, స్వత్ స్వరూపానందగిరి స్వామి పలు ఆశ్రమాలకు చెందిన పీఠాధిపతులను ఉచిత రీతిన సత్కరించారు. స్వాములు కోలా ఆనంద్‌ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో వందలాది మందికి సహపంక్తి భోజనం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మండలాధ్యక్షుడు ఎం, వెంకటరెడ్డి, గ్రామానికి చెందిన కిరణ్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిసి నాయకుడు టిడిపి జిల్లా అధ్యక్షుడైతే సహించలేవా!

-టిడిపి బిసి నాయకుడు చిన్నతంబు గోపికృష్ణ



చంద్రగిరి, జూలై 21 ప్రభాతవార్త: బిసి నాయకుడు సి.ఆర్. రాజన్ టిడిపి జిల్లా అధ్యక్షుడు కావడాన్ని సహించలేక పోతున్నావా అంటూ మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని టిడిపి బిసి నాయకుడు చిన్నతంబు గోపికృష్ణ దుయ్య బట్టారు. చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తి నాని, టిడిపి జిల్లా అధ్యక్షుడు సి.ఆర్.రాజన్‌లపై చెవిరెడ్డి అసత్య ఆరోపణలు చేశారంటూ ఆయన ఆదివారం ఈ మేరకు స్పందించారు. కార్యకర్తలను పట్టించుకోకపోవడంతోనే ఘోరపరాభవం ఎదురైనట్లు వైసిపి వాళ్లే వాపోతున్నారని ఎద్దేవా చేశారు. 2019 ఎన్నికలలో విజయం సాధించిన చెవిరెడ్డి 5 ఏళ్ళలో నియోజక వర్గంలోని ప్రజలను గానీ, పార్టీ క్యాడర్‌ను గానీ పట్టించుకోలేదన్నారు. దీంతో విసిగిపోయిన ప్రజలు 5 ఏళ్ళ పాటు ప్రజల పక్షాన నిలిచిన పులివర్తి నానికి భారీ విజయం అందించారని గుర్తు చేశారు. బిసిలతో చిచ్చు పెట్టుకున్న ఏ రాజకీయ పార్టీ మనుగడ సాధించలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ మండల అధ్యక్షుడు బి.మణికంఠ యాదవ్, బి.సి.ఎ.కమిటీ జిల్లా కోశాధికారి జె.బాలకిషోర్, మాజీ వైస్ సర్పంచ్ కె.సుబ్రమణ్యం యాదవ్, జనసేన నాయకుడు ఎస్.ఎస్.కోటేశ్వరావు, టిడిపి నాయకులు సి.శేఖర్, డి.హరి, పి.లోకాచ్చారి, తదితరులు పాల్గొన్నారు.

## మీ అందరి సహకారం మరువలేనిది : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జూలై 21 ప్రభాతవార్త : ఉద్యోగాన్ని ఒక బాధ్యతగా భావించి ప్రజలకు సేవలు అందించాలని, విధుల్లో మీరందరూ అందించిన సహకారం మరువలేనిదని నగర పాలక సంస్థ కమిషనర్ అధితి సింగ్ అన్నారు. కడప జాయింట్ కలెక్టర్‌గా పదోన్నతి పై వెళ్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ అధితి సింగ్‌ను సమావేశ మందిరంలో ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు అందరూ తమ విధులను బాధ్యతతో నిర్వహించాలని అన్నారు. ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది అంతా తనకు ఎంతో సహకరించారని అన్నారు. తాను వచ్చి కొద్ది కాలమే ఇక్కడ పనిచేసినా ప్రతి ఒక్కరూ తనకు బాగా సహకరించారని మీ సహకారం మరువలేనిది అన్నారు. తాను పదోన్నతిపై వెళ్ళినా, ఎక్కడ విధులు నిర్వహించినా ఇక్కడ పనిచేసిన కాలం జీవితంలో గుర్తుండి పోతుందన్నారు. అన్ని విభాగాల అధికారులు తమ స్థాయికి మించి సహకరించారని అన్నారు. రానున్న అధికారులు తమ స్థాయికి మించి సహకరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరన్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, స్మార్ట్ సిటి జిఎం చంద్రమౌళి, ఆర్‌ఓలు సేతుమాధవ్, కెవల్ వర్మ, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ రెడ్డి, సెక్రటరీ రాధిక, డిసిపి శ్రీనివాసులు, మేనేజర్ చిట్టిబాబు, డిఈలు, శానిటరీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస మంగాపురంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామివారికి వైభవంగా గరుడ సేవ నిర్వహించారు.

ప్రభాతవార్త - చంద్రగిరి

## గురుపౌర్ణమి దర్శనాలకు భక్తుల తాకిడి



శ్రీకాళహస్తి,జూలై 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి గురుపౌర్ణమి సందర్బంగా భక్తులు కడలి తరంగాల్లా కదలి వచ్చారు. సాధారణంగా ఆదివారం ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. పౌర్ణమి సందర్బంగా ఆలయానికి భక్తుల సంఖ్య అధికంగానే ఉంటుంది. అయితే ఆదివారం రావటంతో కొంత రద్దీ పెరిగింది. కానీ నెల రోజులుగా ఈ బాధ కొంత వరకు తగ్గిందని చెప్పవచ్చు. అయితే వచ్చిన విఐపిలుకూడా టిక్కెట్లు కొనమని ఆదేశించటంతో కొంత వరకు ఆదాయాలు పెరుగుతున్నాయి. ఇక ఆలయంలోపల దళారులను అనుమతించకుండా ఎఇఓ లోకేష్‌రెడ్డి కట్టుదిట్టం చేస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వ రాలయం నిత్యం రాహుకేతుదోష నివారణ పూజలతో కిట కిట లాడుతుంది. అధికారికంగా అందించిన సమాచారం మేరకు అభిషేక దర్శనం నాలుగు, స్వామి అమ్మవార్ల అభిషేకాలు 97 మృత్యుంజయ ఏకాదశ రుద్రభిషేకాలు 44 రాహుకేతుదోష నివారణ పూజలు సుమారు 5500 ప్రత్యేకదర్శనం టిక్కెట్లు 7వేలు అమ్మకం అయ్యాయి. ప్రసాదాలు కూడా గణనీయంగా అమ్ముడు పోయినట్లు తెలిపారు.

# చెరివి చిన్నారుల చింతలు తీర్చండి సారూ..!

-ప్రమాదకరగోతులు.. సచివాలయ మొండిపిల్లర్లతో ఇబ్బందులు

సత్యవేడు, జూలై21 ప్రభాతవార్త: సత్యవేడు మండలం చెరివి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సుమారు రెండేళ్ళకుపైగా అనేక సమస్యలు వేదిస్తున్నాయి. కనీసం పాఠశాల ముందుభాగంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో సాయంత్రం వేళల్లో ఆడుకోవాలంటే ఇబ్బందులు తప్పడంలేదు. అక్కడ నెలకొన్న సమస్యలపై ఉపాధ్యాయులు మండల శాఖ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న స్పందన లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. వర్షాకాలంలో ఇక్కడి విద్యార్థులు తరగతి గదికే పరిమితం కావాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది.

**చెరివి చిన్నారులు ఎదుర్కోంటున్న సమస్యలు:**



చెరివి ప్రాథమికోన్నత పాఠశాలలో సుమారు 60మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విశాలమైన ఆటస్థలం అందుబాటులో ఉన్నా వీరు సాయంత్రం వేళల్లో ఆటలు ఆడుకోవడం ప్రమాదకరంగా మారింది. పాఠశాల ఆవరణలోనే సచివాలయ నిర్మాణానికి కొందరు గ్రామస్తులు, తల్లిదండ్రులు వద్దని నెత్తినోరు మొత్తుకున్నా, సచివాలయ నిర్మాణానికి కొందరు పూనుకున్నారు. పాఠశాల ఆవరణలోనే ఈ భవనాలు ఏర్పాటు చేస్తే సమస్యలు వస్తాయని విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. పునాదులు తీసి కాంక్రీటు పిల్లర్లు వేశారు. ఇంతలోనే హైకోర్టు ప్రజల పక్షాన ఓ మంచి తీర్పు ఇచ్చింది. పాఠశాల ఆవరణలో ప్రభుత్వ భవనాలు నిర్మించవద్దని తీర్పు వచ్చింది. దాంతో భవణ నిర్మానాలు ఆగిపోయింది. పిల్లర్ల చుట్టూ ఎక్కడబడితే అక్కడ ఇనుప కమ్మీలు వదిలేశారు. దాంతో పిల్లలు అక్కడికి వెళ్ళకుండా చూడటం ఉపాధ్యాయులకు భారంగా మారిపోయింది. నిర్మా ణానికి తీసిన పెద్దపెద్ద గోతులు ప్రమాదాలను ఆహ్వానిస్తు న్నాయి. గంటసేపు వర్షం కురిసినా ఆగోతుల్లో వర్షపునీరు నిలబడిపోతుంది. కొందరు మందుబాబులు అక్కడే మద్యం సేవించి మందుసీసాలు పగుటగొట్టి వెళ్ళి వెళ్ళిపోతున్నారు. ప్రహరీగో నిర్మాణానికి దాతలు ముందుకు వస్తున్నా కొందరు వ్యక్తిగత స్వార్థంతో సమస్యలు సృష్టిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనికితోడు ఎంబుక్కుల్లో నమోదు కాని పనులకు బిల్లులు అడుగుతుండటం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు వీటిపై దృష్టిపెట్టి పెట్టాలని తల్లిదండ్రులు అక్కడ ఉపాధ్యాయులు కోరుతున్నారు.